కథానిక:

జీవితాశ

శ్రీ అవ్వారి నారాయణ

శ్రీ దినము ఏకాదశిపండుగ. మేము మా వూరికి పోవ బస్సు నెక్కితిమి. మాది పట్టణ వాసము. ఆ పట్టణము మునిసిపాలిటీకి చెందినది. అక్కడ రేషనింగు కట్టుదిట్టలో నున్నది. గేటుదగ్గర కావలివాండ్రుందురు. ఊరిలోనికి పోవు బస్సులనుకాని, బండ్లనుకాని ఆపి వానిలో నేమైన బియ్యము మొదలగు ఆహారపదార్థాలు తీసికొనిపోవుదురా యని కావలివాండ్రు తనిఖీ చేయుదురు. మేమెక్కిన మోటారు గేటుదగ్గర ఆపబడినది. కావలివాండ్రలో నొకడు మోటారు పైనెక్కి చూచుచుండ, ఒక పల్లె ముసలియామె మూటను సంచిలోకట్టి నెత్తిన బెట్టుకొని ఒక వెదురు ఉయ్యాల భుజముపై వేసుకొని గేటు దగ్గర పోవుచుండ, కావలివాండ్రలో మరియొకడామెను పట్టుకొనుట గాంచితిమి.

"దయచేసి నన్ను విడువుము. నా బిడ్డ యుండు పల్లె చాల దూరమున్నది. నే నక్కడికి పోవలె"నని ముసలిది బ్రతిమాలుకొనుచుండ "నీ యిష్టమున్నచోటికి పోవచ్చును. కాని! నీ మూటలో నే మున్నదీ మాకు చూపవలెను. ఇక్కడకువచ్చి మూట విప్పు"మని కావలివాడు గద్దించిపలికెను. "ఆ! మూటలో ఏమీ లేదు. ఉయ్యాలపై కప్పుటకు చినిగిన బట్టలును, పిల్లవానికి ఒక సీసా చమురును, మిరియాల డబ్బియును, కొంచము బియ్యమున్నవి. నేను ప్రొద్దున ప్రయాణ మయినాను. సాయంత్రము లోపల ఆ పిల్లయుండుపల్లె చేరవలెను. ఆ పిల్ల కాన్పువేళకు ఆత్రంగా పోవలెను. కనుక నన్ను విడిచిపెట్టు"మని ముసలిది యనుగ "ఆ! ఏమీ! బియ్యమా! ఇక్కడ రేషనింగ్, గవర్నమెంటు లేదనుకొన్నావేమో? మొదట మూట విప్పు" మని కావలివాడు గర్జించుచు నెత్తిపై నున్న మూటను క్రిందికిలాగి, మూట విప్పి బియ్యము పట్టుకొనెను.

ముసలియామె గడగడ వణకుచు, వానిచేతులు పట్టుకొని బ్రతిమాలుచు బియ్యము యివ్వుమని వేడుకొనెను. వాని కిచ్చుట కామెదగ్గర దమ్మిడీయును లేదు. ఆమె కన్నీటిధార, హృదయావేదన వాని హృదయమును కరగింపవాయెను. ఆ మూటతో నామె పోలీసుస్టేషన్ దగ్గరకు పిలుచుకొని పోబడెను. మరుసటి దినమామె మాజిస్ట్రేట్ ఎదుట నిల బెట్టబడెను. కావలివాడొక సాక్షిని యుంచెను. "నీమీ దొక నేరమున్నది. నీవు రేషనింగ్ యుండు పట్టణములోనికి బియ్యము కొని తెచ్చినావు. అది రేషనింగ్‌కు వ్యతిరేకము. కనుక నీకు 121 సెక్షన్ ప్రకారము శిక్ష యివ్వబడును" అని మాజిస్ట్రేట్ తీర్పు చెప్పగా విని "ఏమీ! శిక్షా! నేనేమి చేసినాను? దొంగతనము చేసినానా? లేక ఎవరినైన చంపినానా? నా స్వంత బియ్యము నా బిడ్డకు తీసికొని పోకూడదా? మా యూరిలో యింటింటికి బిక్షమెత్తి, నా బిడ్డ కాన్పుఐన తర్వాత ఒక వారమైన అన్నము వండిపెట్టవలెనని తీసుక పోతున్నాను. ఆమె రాగి సరిగాని, గంజిగాని త్రాగకూడదు. నా కొడుకు కల్లుత్రాగి, అప్పుచేసి యున్న భూమంతయు అమ్మినాడు. నా బిడ్డ కిచ్చిన రెండు ఎకరములుకూడ అమ్మినాడు. నన్ను వెడల గొట్టినాడు. నేను వాని యింటిలోనికి పోయిన చంపునేమో యని వెఱచి, బిక్షమెత్తుకొని, బజారులలోనె బ్రతుకుచున్నాను. నా బిడ్డ కొన్నిదినములలో కాన్పు కాబోతుందనియు, నన్నుచూడ యిష్టమున్నదనియు నాకొక చాకలిది చెప్పెను. ఆమెకు సహాయపడువారెవరును లేరు. కాన్పు సమయమునకు నే నక్కడ పోవలెను. ఈ ఉయ్యాల, బట్టలు, పిల్లవానికి చమురును కొంటిని. ఇప్పుడైనను పోనిండు. ఆమె నా రాకకై వేచియుండును; అని ముసలిది తన విషయము చెప్పుకొనగా "ఇక చాలునీ యవివేక పురాణము. నీ కెవరయిన ప్రతివాది వున్నాడా?" యని మాజిస్ట్రేట్ అడిగెను. "ప్రతివాదీ... నాకా...బిక్షకత్తెను...నిజము చెప్పుతున్నా! ఎవరు వస్తారు? నా కెవరు తెలుసు?...లే దండీ, నాకు దేవుడే సాక్షి." అని యామె పలుక "ఊ...సరే...దేవుడు వచ్చి నిన్ను నీ బిడ్డదగ్గరకు తీసుక పోతాడు" అని మాజిస్ట్రేట్ నిందించెను.

అర్ధ గంటయినది. మాజిస్ట్రేట్ తన తీర్పును చదువుచు "నీవు రూల్సుకు వ్యతిరేకముగ నడచినావు గనుక నాలుగు నెలలు శిక్ష విధించబడినది. బియ్యము సర్కారు స్వాధీనము చేయబడును" అని చెప్పి యామెను జైలున పెట్టించెను. ఆమె కేమియు తోచలేదు. తా నొకటి తలచిన దైవ మొకటి తలచెను. తా నా రాత్రి దిగులు నొంది నిద్రించుచు కలలు గనుచుండెను. "ఏ మమ్మా, నేలమీద పిల్లవాణ్ణి పండబెట్టినావు? ఇవిగో ఉయ్యాల, బట్టలు, పిల్లవాణ్ణి దానిలో పండబెట్టు. నే నూపుతా" ననుచుకలలో—

ఏడువాకు, ఏడువాకు ఎఱ్ఱిఅబ్బాయి
ఏడిస్తే నీ కళ్ళు నీరు కారు
ఏడిస్తే నిన్నెవ్వ రెత్తుకుంటారు
ఏడవాకు నాయన్న! నా ముద్దుబాల!

అనుచు కలలో బిగ్గరగా పాడసాగెను. అంతలో జైలు కావలివాడు తలుపు తీసెను. అవి యినుపతలుపులు; కనుక ఎక్కువ శబ్దము చేసెను. ఆ శబ్దమున కామె లేచి, తాను నిద్రలో నేమోమో కలవరించుకొంటున్నానని నివ్వెఱపడెను. ఆ పిమ్మట నిద్ర రాలేదు. తెల్లవారువరకు దుఃఖ మినుపడింప కన్నీరుమున్నీరుగా గార్చుచుండెను. రేషనింగ్ కావలివానిని మాజిస్ట్రేటును తిట్టుకొనుచుండెను. నాలుగునెలలు ఎప్పుడు గడచునా యని చింతించుచు దినములు, వారములు లెక్కించుచుండెను. మే నెలలో నొకదినమున విడుదల చేయుదురని ఆమెకు తెలిపిరి. జైలులో తన కిచ్చుచుండిన బియ్యములో సగము వండుకొనితినుచు, తక్కిన బియ్యము బట్టలలో దాచిపెట్టుకొనుచుండెను. ఆఖరుదినమున ఆమెను విడుదలచేసిరి. గుప్తంగా బియ్యము దాచుకొని ఆమె జైలునుండి బయటికి వచ్చెను.

ఆ దినము రాత్రి తాను కావలివాండ్రను తప్పించుకొనెను. రాత్రియనక, పాము పురుగనక తడబడ నడచి తనకూతురు గ్రామము చేరుకొనెను. గ్రామమంతయు నిద్రావస్థలో నుండెను. తన్నాహ్వానించువా రెవరును లేరు. చంద్రుడు తేజముగ ప్రకాశించుచుండెను. సంతోష ముప్పొంగిన హృదయముతో నామె తన బిడ్డయిల్లును వెదకుచు దాపునకు పోయెను. తలుపు తెఱచుమని రెండుసార్లు బిగ్గరగా తలుపును తట్టెను. ఎవరో నా నిద్రను భంగము చేయుచున్నారని అఱచుచు, వాకిలి తెఱచి, "బిక్షముపెట్టుట కిపుడు సమయమా? పొమ్మవల"యని కుత్తుక చీల్చుక తన అల్లుడు గద్దించి పలికెను. "కాదు కొడుకా! నేను నీ యత్తను. నీ భార్యతల్లిని. బిక్షకత్తెనుగాను. నీ భార్యకాన్పునకు వచ్చితిని. కాని వేళకు రాలేకపోతిని. నేను మార్గమధ్యమున నాలుగునెలలు నిర్బంధింపబడితిని. నామీద కోపపడకు. నా బిడ్డను, నీ బిడ్డను చూడవలె నని నాకు చాల ఆతురత యున్నది. నన్ను యింటిలోనికి రాని"మ్మని వేడుకొనెను. "చావుపో! వారిని చూచుటకు ముందు నీవు చచ్చిపోతావు చూడు. నా యింటిలో అడుగు పెట్టితే చంపుతా నని నీకు చెప్పి యుండలేదా? ఈ స్థలమునుండి దాటి పో" యని యతడు రోసించుచు పలికెను.

"హా! కుమారా! నేను నీ యత్తను కాదా! నా కుమార్తెను నీ కియ్యలేదా! నీకు నే నేమి తప్పు చేసితిని. ఏ వస్తువు నిన్నడుగను. నా బిడ్డనైన చూడనిమ్ము. నేను తెచ్చిన ఉయ్యాల, బట్టలు, చమురు, బియ్యము వారి కిమ్ము. రేపు ప్రొద్దుననే నీ యిల్లువిడిచి పోదును. నన్ను వారి నొక్కసారి యైన చూడనిమ్ము. నీకు పుణ్యము కలుగును." అని ఏడ్వ సాగెను.

"నీ కూతురా! ఇక్కడ లేదు. టెంకాయ చెట్ల తోపులో తన బిడ్డతోకూడ కూడియున్నది. నీ వక్కడికి పోయి, బిడ్డదగ్గరనే ఎక్కువ కాల ముండు"మని తలుపుమూసి పండుకొనెను.

ఆమె తన యల్లుని నిర్దయకు బాష్పములు విడచుచు, కరములు జోడించి, దేవుని యిట్లు ప్రార్థించెను. "ఓ! దైవమా! దయార్ద్రహృదయా! నా అవివేకము వలనను, మూర్ఖత్వము వలనను నిన్ను తెలియక నిందించితిని. నా స్వార్థముతో నిన్ను దూషించితిని. నన్ను క్షమింపుము. పాపహరణా! నా యల్లునిలో నెటువంటి మార్పు కలుగ జేసితివి? నన్ను చంప దలచిన నా యల్లుడు నా బిడ్డ దగ్గరకుబోవ నాన తిచ్చినాడు. నా దుఃఖము లంతమున చేరినవి. నా బిడ్డదగ్గర చేరుదును. శిశువును ఉయ్యాలలో నూపుచూ పాటపాడి ఓదార్చుదును. ఒక్క క్షణమైన నా బిడ్డను విడనాడను. నన్నీ స్థితికి తీసుక రావడమునకు మాజిస్ట్రేట్, కావలివాండ్రే కారణము. ఈ దుఃఖాబ్ధిలో మునిగి నిన్నెంతోదూషించితిని. క్షమింపుము."

ఆమె టెంకాయ చెట్ల తోపువైపునకు నడచి తోపులో దూరెను. తోపంతయు గాఢాంధకారముతో నుండెను. "బిడ్డా... బిడ్డా..."యని పిలిచెను. ఆ తోట కావలివాడు ఆమె ధ్వని విని బయటికి వచ్చి "ఎవరు నీవు? ఎక్కడెందులకు పోవుచున్నా"వని యడిగెను. "నా బిడ్డ యీ వనములో నున్న దని నా యల్లుడు చెప్పగా, నా మెను కలసుకొనుటకు వచ్చితిని. వారు గుడిసెలో లేరా" యని యడిగెను. "ఏమీ! నీ కూతురా! నీ కూతురా! ఇక్కడున్నా దని నీ యల్లుడు చెప్పెనా? అవును...ఉన్నాది...యీ గోరీలో!" యని యీ కావలివాడు బదులు చెప్పెను. ఆ మాట వినగానే "ఏరీ...ఏరీ...చూపించు...నాకు. ఈ దుఃఖము నే నాపజాల!" యని ఏడ్వ సాగెను. "అక్కడొక పెద్ద మఱ్ఱివృక్షము కలదు. దాని చుట్టును కంచె కలదు. ఆ కంచె అడుగున ఒక తిప్ప కలదు. ఆ తిప్పలో నున్నారు. నీ వక్కడ పోయి వారితో పాటు ఎక్కువ కాలము జీవింప వచ్చును." అని చెప్పగా విని ఆమె "వారి కొక్క గుడిసెయైన లేదా! వా రెట్లు బ్రతుకుచున్నారు. ఆమె అన్నమెట్లు వండ గలదు. ఉయ్యాల ఎక్కడ కట్టును. నాకు దృష్టి తక్కువ. కనుక వారిని చూడలేకున్నాను. దయచేసి వా రెంతదూర మున్నారో చెప్పుము" అని మరల యడిగెను.

నిరాశ హృదయురాలై ఆమె మఱ్ఱివృక్షము కడకు పోయెను. తిప్పను కనుగొనెను. "బిడ్డా... బిడ్డా"యని పిలిచెను. కాని బదులు రాలేదు. ఆమె తిప్పంతయు వెదకెను. చుట్టు ప్రక్కల చూచెను. ఆకాశమువైపు నిరీక్షించెను. కాని ఎవరును కానుపించలేదు. శోకముతో దద్దరింపబడిన హృదయముతో నామె కన్నీరు గార్చుచు "నా బిడ్డ యెక్కడ?...నా బిడ్డ యెక్కడ?" యని కావలివానిని మరల యడిగెను. "నీవు నిలబడియున్న తిప్పక్రిందనే మూడు అడుగులలోపల నీ బిడ్డయు, పసిపాపయు కలరు. ఆమె భూగర్భములో నున్నది. ఎందుకు బయట వెదకుచున్నావు?" అని చెప్పుచు కావలివాడు నవ్వెను. ఆ మాటలు వినగానే ఆమె గుండె ఝల్లుమనెను. శోక గాఢాంధకారమున నామె కేమియు దిక్కుతోచలేదు. కాళ్ళు చేతులు నిట్టనిలవున నిలిచిపోయెను. తాను జైలులో నున్నప్పుడు వచ్చిన కల నిజమనుకొనెను. "ఓ దయార్ద్రహృదయా! నా బిడ్డదగ్గర నన్నును చేర్చుము. నే నిక బ్రతుకజాలను"అని తిప్పపై బడి దీనవాక్యములు వినునట్లు గట్టిగా మొఱపెట్టుకొనెను.

గోరుచుట్టుపై రోకలిపోటన్నట్లు ఆరాత్రియే ఘోరముగా వర్షము కురియ నారంభించెను. అటువంటి వాన వా రెన్నడును చూచియుండలేదు. మెరుపులును, మేఘగర్జనలును జనులను కంపింప జేసెను. పెక్కువృక్షములు నేల కూలబడి త్రోవ కడ్డముగ నుండెను. ప్రొద్దుననే పల్లెవారు టెంకాయ వనములోనికి పనిచేయుటకు వెళ్ళిరి. వారొక వింత దృశ్యమును చూచిరి. మఱ్ఱిచెట్టు వేళ్ళతోపాటు కూలబడియుండెను. దాని ప్రక్కనే తిప్పమీద ముసలియామె పడియుండెను. ఆమె దేహమంతయు చితికిలబడియుండెను. ఉయ్యాల, బట్టలు, చమురు సీసా ఆమెచుట్టును పడియుండెను. పల్లెవారు ఆమెను గుర్తించి, దుఃఖించి, పరితాపము నొందుచు కన్నీరు విడచిరి. "పాపము! ఇది యీమె విధి. పరమాత్ముడు ఆమెమీద దయ దలచినాడు. ఆమెను ఆమె బిడ్డదగ్గరకే చేర్చినాడు. జీవమున్నప్పుడు ఒకరి నొకరు చూడకున్నను, మృత్యువులో నిద్దఱు ఏకమైనారు. ఇది దేవునికరుణ. ఇంక మన మేమియు సంతాపము పొంద నవసరములేదు. అదంతయు దేవునికే వదలివేసితిమి"అని పల్లెటూరి పూజారి దీవించెను.

బట్టలు, ఉయ్యాల, చమురుసీసాతో సహా వారామెను తనబిడ్డ గోరి ప్రక్కనే పూడ్చిపెట్టిరి. పల్లెవారు తమ పనులకు వెళ్ళిపోయిరి.

సాయంత్రము కాజొచ్చెను. ఒక యువకుడామె గోరీవైపు చూచుచు కదలక మెదలక నిలబడెను. తనను తాను నిందించుకొనుచు "నేనే ఆమెను పరిహాసము చేసితిని. ఓ దేవా! క్షమింపుము. నేనే హంతకుడను. కఠినాత్ముడను దయజూపుము. వారికి జూపిన గతియే నాకును చూపుము" అని క్రిందబడెను.

(డి. శ్రీనివాస అయ్యంగార్ వ్రాసిన 'ఎక్సెస్ ఆఫ్ జస్టిస్'కు అనువాదము.)

యుద్ధానికి పూర్వపు దరలకన్న తక్కువ



స్విస్ మేడ్. సరిగా టైంచూపును. ప్రతీదీ 8 ఏళ్లు గ్యారంటి. రాళ్లు అమర్చబడినది.

గుండ్రం లేక చతురం క్రోమియంకేసు	రు. 20/8
,, ,, మేలిరకం	రు. 25/-
బిల్ల పరుపు ఆకారం క్రోమియంకేసు	రు. 30/-
,, మేలిరకం	రు. 38/-
రోల్డుగోల్డు (10 సం॥ గ్యారంటి)	రు. 55/-
రెక్టాంగ్యులర్, టాను, వంపుగలది	
బ్రైట్ క్రోమియం కేసు	రు. 42/-
రోల్డుగోల్డు (10 సం॥ గ్యారంటి)	రు. 60/-
15 రాళ్ళు రోల్డుగోల్డు	రు. 90/-

అలారం టైంపీసు

ధర రు. 18/-, రు. 22/-మేలిరకం రు. 25/-
బిగ్ బెన్ రు. 45/- పోస్టేజి అదనము

H. DAVID & CO.,
Post Box No. 11424, CALCUTTA.

నెరసిన వెంట్రుకలఔషధము

రంగు పూయనక్కరలేదు. ఆయుర్వేద చికిత్స. తెల్లని, రంగును మార్చి శాశ్వతముగా వెంట్రుకలకు నలుపు నిచ్చును. గుణం కానిచో, డబ్బు వాపసు చేయబడును. తెలుపు కొంచమైయుండిన రూ 2-8-0; మధ్యరకమైయుండిన రూ 3-8-0; పూర్తిగా యుండిన రూ 5-0-0.

గమనింపు:-ఇది మెదడుకు కంటికి మంచి పోషణ నిచ్చు ఔషధము.

Bharat Kalyan Aushadhalaya,
No. 18, P. O. Katri Sarai, (Gaya